క్లుప్తంగా

సిరిచెల్మకు పోటెత్తిన భక్తులు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లికార్జున ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణ చివరి సోమవారం కావడంతో మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలోని ధర్మంపూరి గ్రామం నుంచి 50 మంది భక్తులు కాలినడకన సిరిచెల్మకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీలు నీటమునిగాయి. తిలక్‌నగర్ కాలనీలో వర్షం కారణంగా ఇండ్లలోకి వరద నీరు చేరింది. ఇంట్లోని నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. స్పందించిన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

బోథ్: బోథ్ మండలం, కౌఠ(బి) గ్రామానికి చెందిన నాయక్‌పోడ్ సంఘం సభ్యులు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. త్వరలో నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సభ్యులు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

భీంపూర్: మండలంలోని అంతర్గామ్, ధనోరా, నిపాని సమీపంలోని వాగులు, వంకలు సోమవారం కురిసిన భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్సై పీర్‌సింగ్ నాయక్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సెలవులు ప్రకటించాలి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

బోథ్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యాసంస్థలకు రెండు రోజులు సెలవులు ప్రకటించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) బోథ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వరదల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమవడం, సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు.

పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి గోల్కొండ ఖిల్లాపై తొలి జెండాను ఎగరవేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, ఇజ్జగిరి నారాయణ, సంతోష్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సానుభూతి కాదు.. సాయం కావాలి



కాలనీల్లో ప్రవహిస్తున్న వరద



ఇంట్లోకి వచ్చిన వరద

- వర్షం వస్తే వణుకుతున్న సాయినగర్
- ఇళ్లల్లోకి చేరుతున్న వరద
- పరిహారం అందించాలని కాలనీవాసుల వేడుకోలు

బోథ్: తమ కాలనీకి సానుభూతి కోసం రావద్దని.. సాయం చేసేందుకు రావాలని మండలంలోని సాయినగర్ కాలనీవాసులు కోరుతున్నారు. వర్షం వస్తే చాలు సాయినగర్ వాసులు వణికిపోతున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఒర్రె ద్వారా వరద రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరద ఇంట్లోకి చేరడంతో కడుపు నిండా భోజనం తినలేని పరిస్థితి నెలకొంది. సరైన సౌకర్యాలు లేక దయనీయ స్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు.

ఇళ్లల్లోకి వరద..

సాయినగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య సరైన డ్రెయినేజీలు లేకపోవడం. కాలనీ మధ్యలో నుంచి పక్క నుంచి వరద ప్రవహిస్తుండటంతో వరద నేరుగా గుడిసెల్లోకి చేరుతుంది. దీంతో నివాసితులు నిలబడేందుకు కూడా చోటు లేక ఇబ్బంది పడుతున్నారు. సీసీరోడ్లు లేకపోవడం వల్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

విష పురుగులతో భయం.. భయం..

కాలనీ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, పొడవైన గడ్డితో పాములు, తేళ్లు, జెర్రిలు, ఎలుకల బెడద తీవ్రంగా ఉంది. ఈ కీటకాల వల్ల ప్రతీ నిమిషం భయంతో బతకాల్సిన పరిస్థితి నెలకొంది. పాములతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు.

ఏళ్లు గడిచినా.. ఇదే పరిస్థితి..

కాలనీ ఏర్పడి సంవత్సరాలు గడిచినా.. ఇక్కడి పరిస్థితులు మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టుగా ఉన్నాయి. ఎందరో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు మారినా, కాలనీ మాత్రం అభివృద్ధి చెందడం లేదు. పేదల పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కనీస సౌకర్యాలు కూడా కల్పించ లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీల్లో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఇచ్చోడ: ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేసే వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా ఏదైన ఇబ్బది తలెత్తితే రోగులను ఇతర పీహెచ్‌సీలకు తరలించాలని ఆదేశించారు. గర్భిణులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్‌కుమార్, మధురిమ, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఇచ్చోడ మండలంలోని ఎల్లమ్మగూడలో సోమవారం నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మరో 42 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, రాజేశ్వర్, ఏఎన్ఎంలు రేణుక పాల్గొన్నారు.

- ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అడేగామ(కె), గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్, పీహెచ్ఎన్ రాజుబాయి, ఉత్తం, హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, సూభాష్ పాల్గొన్నారు.
- హీరాపూర్‌లో నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది జారుబాయి, సుశీల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకునే జాగ్రత్తలు వివరించారు. ఆశ కార్యకర్త కవిత, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే వ్యాధులు దూరం

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. సోమవారం మండలంలోని కొర్టికల్(కె), వెకంటాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. హెచ్ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వాణి, శ్యామల, చంద్రకళ, గంగామణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ: మండలంలోని పలు బాధిత కుటుంబాలను బోథ్ ఎమ్మెల్యే సోమవారం పరామర్శించారు. మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన ఆడే కైలాష్ కాలుకు రక్తం గడ్డకట్టంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకొని సోమవారం వారి నివాసానికి చేరుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఆడే గోవింద్ రావు నాయక్ తల్లి, రిటైర్డ్ టీచర్ ఆడే రామారావు ఇటీవలే మృతి చెందిన విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఇంద్రవెల్లి: మండలంలోని అందునాయక్‌తండా జ్వాలముఖి, కాలుబాబా, పాచు బాబా ఆలయంలో సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మహరాజ్ రాంసింగ్‌బాబా ఆశీర్వదం తీసుకున్నారు. ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలన్నారు. ఈసందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మీర్జా యాకుబ్‌బేగ్, మసుద్ పాల్గొన్నారు.

పంట నష్టంపై ఫిర్యాదు

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 353బీ హైవే నిర్మాణ పనుల నిర్లక్ష్యంతో పంట నష్టంపై సోమవారం మండల తహసీల్దార్ రఘునాథ్‌రావుకు ఉపశ్‌నాల, కొబ్బాయి, పాటన్ రెవెన్యూ గ్రామాల బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. చవర్‌డోల్ సుఖ్‌దేవ్, వాసుదేవ్, గజానన్, బాబారావు, టేకం గణపత్, కొడప నాగోబా, ధర్నే కునాల్ పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవాలి

ఆదిలాబాద్: భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలను ఆదుకోవాలని ఎస్ఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షేక్ అస్లమ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో వర్షం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురి ఇళ్లను పరిశీలించారు.

బెదిరించిన కేసులో ఒకరి అరెస్ట్

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన షేక్ మహ్మద్ అలీని, బెదిరించిన ఘటనలో పాండురంగ్ అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. 2023లో మండల కేంద్రంలో సిరిచెల్మ చౌరస్తాలో జరిగిన మార్డర్ కేసులో మహ్మద్ అలీ ప్రత్యేక సాక్షిగా ఉన్నాడు. కోర్టులో సాక్ష్యం చెపితే చంపేస్తానని మహ్మద్ అలీని ఈనెల 17న పాండురంగ్ బెదిరించాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

పిచ్చికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో పిచ్చికుక్కల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. సోమవారం మోమిన్‌పుర కాలనీకి చెందిన రహీంతో పాటు మరొకరిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. వెంటనే స్థానికులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మూడు రోజుల క్రితం ఫకీర్‌గుట్ట కాలనీలో ముగ్గురు చిన్నారులపై దాడి చేసి గాయపరిచింది. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కుక్కల బెడదపై నెల 11న సాక్షిలో 'రెచ్చిపోతున్న వీధి కుక్కలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అయినా అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

నేడు, రేపు డీఎడ్ స్పాట్ అడ్మిషన్లు

కైలాస్‌నగర్: రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎస్ఈడీ)లో 2025-2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం ఈనెల 19, 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవీందర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. స్పాట్‌కు హాజరయ్యే అభ్యర్థులు డిసెట్- 2925లో అర్హత సాధించి ఉండాలన్నారు. ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో జరిగే స్పాట్‌కు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. సీట్ల కేటాయింపు వివరాలను మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తెలియజేస్తామన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లకు 20న కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

అధ్వానంగా ఐబీ రోడ్డు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి వేణునగర్‌కు వెళ్లే రోడ్డు వర్షాలకు పూర్తిగా అధ్వానంగా మారింది. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా రోడ్డు



మావల మండల కేంద్రంలోని హరితవనం సమీపంలోని చెరువు మత్తడి గేట్‌ను వేసవిలో దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా.. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండటం, గేట్ లేకపోవడంతో మత్తడి దూకి వరద మండల కేంద్రంలోని మణిపూర్ కాలనీ, పట్టణంలోని రాంనగర్, దుర్గానగర్, కోజా కాలనీల్లోకి వచ్చింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. నూతన గేట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పండ్లు పంపిణీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కనక అభిమాన్ సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో పండ్లు పంపిణీ చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాఠశాలకు హాజరయ్యారు. ఈ వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. బోథ్ మండలంలోని వేదం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. బజార్‌హత్నూర్ మండలం గులాబ్‌తండా గ్రామానికి చెందిన ఆడే సుభాష్‌కు రూ. 67,500, తాంసి మండలంలోని పాలోడికి చెందిన సిరికుడ విద్యకు రూ. 12వేలు, జక్కుల సునీల్‌కు రూ.7వేలు, తలమడుగు మండలం కురుకుల భీమేశ్వరికి రూ.60వేలు, ఇచ్చోడ మండలం మాధవపూర్‌కు చెందిన సయ్యద్ ముజహీద్‌కు రూ.60వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జాదవ్ విద్యాసాగర్, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రతాప్, సుధీర్‌రెడ్డి, సురేందర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీ వీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు హాజరయ్యారు. విద్యార్థినులతో కలిసి సాంప్రదాయ పాటలపై నృత్యం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శివారెడ్డి, దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, జాదవ్ మహేందర్, సాబ్లే ప్రతాప్, సాబ్లే సంతోష్ పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో ఉత్తమ బోధన



పరిశీలిస్తున్న ఎంఈవో ఉదయ్‌రావ్

గుడిహత్నూర్: బోధనోపకరణాలతో ఉత్తమ బోధన సాధ్యపడుతుందని మండల విద్యాధికారి రాథోడ్ ఉదయ్‌రావ్ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండలస్థాయి టీఎల్ఎం (టీచర్ లర్నింగ్ మెటీరియల్) మేళాను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనోపకరణాలు తయారీ చేయడం అభినందనీయమన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపకరణాలను ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎల్ఎం నోడల్ అధికారి గోపాల్‌సింగ్ తిలావత్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్ఎంలు అబరీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి టీఎల్ఎం(అభ్యసన అభివృద్ధి మేళా)లో ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. మేళాలో ప్రదర్శించిన ప్రాజెక్టులను ఎంఈవో సునీల్‌తో కలిసి డీఎల్‌పీవో ఫణింధర్ తిలకించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రాజెక్టులు విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించేలా ఉన్నాయన్నారు. న్యాయ నిర్ణేతలుగా జాదవ్ పుండలిక్, రతన్ సింగ్‌లు వ్యవహరించారు. మండల స్థాయిలో 10 పాఠశాలలు పాల్గొన్నాయన్నారు.

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి బోధనోపకరణల మేళా ఆకట్టుకుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సృజనాత్మకతతో తయారు చేసిన బోధనోపకరణాలను సోమవారం ప్రదర్శించారు. మండల నోడల్ అధికారి కదం మహాలక్ష్మి, వెంకన్న, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ఉపాధ్యాయులు తమ బోధన సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు టీఎల్ఎం మేళాలు ఎంతో దోహదం చేస్తాయని ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్య అన్నారు. ఆదిలాబాద్ అర్బన్, మావల మండలాలకు చెందిన ఉపాధ్యాయుల టీఎల్ఎం మేళాను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించారు. హెచ్ఎం నీలాదేవి పాల్గొన్నారు.

'వరద బాధితులకు అండగా ఉంటా'



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న గజేందర్

బోథ్: వరద బాధితులకు అండగా ఉంటానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం బోథ్ పట్టణ కేంద్రంలోని సాయినగర్, కరత్వాడ, నక్కలవాడ గ్రామాల్లో పర్యటించి, దెబ్బతిన్న ఇళ్లను, వ్యవసాయ పొలాలను పరిశీలించారు. నష్టపోయిన కుటుంబాలకు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందించారు. నక్కలవాడలో వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ధన్నూర్(బి) గ్రామ శివారులో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కరత్వాడ ప్రాజెక్టును సందర్శించి, నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నందున దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, గొర్ల రాజు యాదవ్, చాట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ రహీముద్దీన్, షేక్ మహమ్మద్, జీకే గంగాధర్, అబుద్, జీకే గంగాధర్, కైపెల్లి రవి, ప్రశాంత్ గౌడ్ పాల్గొన్నారు.



నార్నూర్: బంజారా సంస్కృతి, సంప్రదాయాన్ని చాటి చెప్పే పండుగల్లో తీజ్ ముఖ్యమైనది. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. బుట్టలో నాటిన గోధుమ మొక్కలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, వార్డెన్ వనతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థినులు సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

వారసంతలో 'పొలాల' సందడి



దుకాణంలో ఎడ్ల అలంకరణ సామగ్రి

ఇంద్రవెల్లి: ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించే పొలాల అమావాస్య పండుగ సమీపిస్తుండడంతో సోమవారం మండల కేంద్రంలో నిర్వహించి వారసంతలో పొలాల పండుగ వాతావరణం నెలకొంది. దుకాణాల్లో ఎడ్ల అలంకరణ సామగ్రి, రంగులను రైతులు పోటీపడి కొనుగోలు చేశారు. ఈనెల 23న పొలాల అమావాస్య పండుగ ఘనంగా నిర్వహించనున్నట్లు రైతులు తెలిపారు.

ఐటీడీఏ ఎదుట ధర్నా

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్-హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉట్నూరు మండల కేంద్రంలో ఐటీడీఏ పీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సేవలకు తప్పనిసరి చేసిన పేస్ క్యాప్చర్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీలో నిర్వహించాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. రత్నమాల, మడవి నాగరావ్, పార్వతి, రషిక, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు